# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పహల్ గామ్ ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ భరోసా ఇచ్చారు.
- రైతు సాధికారతకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ చెప్పారు.
- భారతదేశంలో 90 శాతం మంది క్యాన్సర్ రోగులకు, రోగ నిర్ధారణ జరిగిన 30 రోజుల్లోగా చికిత్సను ప్రారంభిస్తున్నామని కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పి. నడ్డా తెలిపారు.
- జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) పహల్గామ్ ఉగ్రవాద దాడి కేసు దర్యాప్తును ప్రారంభించింది.

============================

కాశ్మీర్ లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేనివారు జరిపిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. మన్ కీ బాత్ మనసులోని మాట 121వ సంచికలో భాగంగా ఈరోజు ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. కాశ్మీర్ లో ప్రజల ఆదాయం పెరిగిందని, యువతకు నూతన అవకాశాలు విస్తృతమవుతున్నాయని, ప్రజాస్వామ్యం పటిష్టం అవుతుందని అన్నారు. వీటిని నాశనం చేయాలనే దురుద్దేశంతో ఉగ్రవాదులు ఈ చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధంలో 140కోట్ల ప్రజల ఐకమత్యమే ప్రధానమని, ఇదే మన బలమని చెప్పారు. బాధిత కుటుంబాలకు న్యాయం లభిస్తుందని తాను భరోసా ఇస్తున్నానని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

అలాగే.. సృజనాత్మకతకు ప్రాముఖ్యత ఇచ్చే వ్యక్తిగా ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ నిలుస్తారని ప్రధాని మోదీ అన్నారు. విజ్ఞానంతో పాటు భారతీయ అంతరిక్ష కార్యక్రమాలను నూతన శిఖరాలకు తీసుకువెళ్ళేందుకు ఆయన చేసిన కృషిని దేశం మననం చేసుకుంటుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో ఆయన నిస్వార్థంగా అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పారు. మన దేశ నూతన జాతీయ విద్యా విధానాన్ని రూపొందించడంలో కస్తూరి రంగన్ ముఖ్యమైన పాత్రను పోషించారని ప్రధానమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

============================

రైతు సాధికారతకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ అన్నారు. ఈరోజు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రైతుల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. పి.ఎం కిసాన్ యోజన వంటి పథకాలు రైతులకు ఉపయుక్తంగా నిలుస్తున్నాయని జగదీప్ ధనకర్ తెలియజేస్తూ...

(వాయిస్ బైట్..30 సెకన్లు)

అలాగే.. 2047 నాటికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలవాలంటే అన్ని రంగాలలో ఆర్థిక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యవసాయ సంబంధిత రంగాలలో పెట్టుబడులు పెట్టాలని కార్పొరేట్ సంస్థలను ఉపరాష్ట్రపతి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో 90 శాతం మంది క్యాన్సర్ రోగులకు, రోగ నిర్ధారణ జరిగిన 30 రోజుల్లోగా చికిత్సను ప్రారంభిస్తున్నారని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె.పి. నడ్డా అన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక ట్రూ బీమ్ యూనిట్ ప్రారంభోత్సవంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ చొరవ, కృషి ఫలితంగా, ఇది సాధ్యపడిందని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన వైద్య పత్రిక 'ది లాన్సెట్' నివేదికను ఆయన ఉదాహరించారు. భారత్ క్యాన్సర్ సంరక్షణలో పెద్ద ఎత్తున పురోగతి సాధిస్తోందని, కాన్సర్ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయడం, ముందస్తు రోగ నిర్ధారణను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. నేడు దేశవ్యాప్తంగా 780 వైద్య కళాశాలలు పనిచేస్తున్నాయని, వైద్య విద్య, ఆరోగ్య సేవలకు ప్రభుత్వం నిధుల కొరత లేకుండా చేసిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలతో పహల్గామ్ ఉగ్రదాడి కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) ప్రారంభించింది. దాడి జరిగిన ప్రదేశంలో NIA బృందాలు ఆధారాలను సేకరించే పనిని ముమ్మరం చేశాయి. బైసరన్ లోయలో ఉగ్రదాడిని చూసిన ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలను ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో NIA బృందాలు రాబడుతున్నాయని NIA ఒక ప్రకటనలో తెలిపింది. ఉగ్రవాదులు వచ్చి వెళ్ళిన మార్గాలను నిశితంగా పరిశీలిస్తూ దాడికి సంబంధించిన ఆధారాలను NIA సేకరిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో మధుబని పెయింటింగ్, బౌద్ధ సన్యాసుల సింగింగ్ బౌల్ సంగీత విభాగాలకు రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు లభించాయి. ఈరోజు పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు వీటికి సంభందించిన సర్టిఫికెట్లను అందజేశారు. పద్మశ్రీ జగదాంబ దేవికి నివాళి అర్పిస్తూ ప్రముఖ కళాకారిణి బౌఆ దేవి మార్గదర్శకత్వంలో మధుబని పెయింటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లో 18.69 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భారీ మధుబని పెయింటింగ్‌ను రూపొందించారు. ఈ ఘనతను సాధించినందుకు అధికారులు మిథిలా చిత్రకారిణి బౌఆ దేవిని సత్కరించారు. మరొక కార్యక్రమంలో బుద్ధగయలో వివిధ మఠాల నుండి వచ్చిన 375 మంది బౌద్ధ సన్యాసుల బౌల్ సంగీత బృందం అతిపెద్ద సమావేశంగా ప్రపంచ రికార్డును సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ కు ఈరోజు బెంగళూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. డాక్టర్ కస్తూరి రంగన్ శుక్రవారం బెంగళూరులో కన్ను మూశారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఈరోజు రామన్ పరిశోధన సంస్థలో ఉంచారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ తదితరులు నివాళులు అర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చార్ ధామ్, హేమకుండ్ సాహిబ్ తీర్థయాత్రలో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న 77 మంది పాకిస్తానీయుల రిజిస్ట్రేషన్‌ను ఉత్తరాఖండ్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి సత్పాల్ మహారాజ్ ప్రకటించారు. పర్యాటకం, ఉగ్రవాదం కలిసి సాగలేవని స్పష్టం చేశారు. భక్తులకు సురక్షితమైన, ఆధ్యాత్మికంగా సంతృప్తికరమైన అనుభూతిని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు.

కాగా.. చార్ ధామ్ యాత్రకు ఇప్పటివరకు, 185 దేశాల నుండి 25 వేల మందికి పైగా అంతర్జాతీయ యాత్రికులతో సహా 22 లక్షలకు పైగా భక్తులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు.

==============================

భారత సైన్యాన్ని ఆధునికరించడం కోసం బ్యాంకు ఖాతాను ప్రారంభించిందని పేర్కొంటూ సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య సందేశం వ్యాప్తి జరుగుతోందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన వాస్తవాల తనిఖీ విభాగం ఈ సందేశం నకిలీదని స్పష్టం చేసింది. అదేవిధంగా సైనిక కార్యక్రమాలలో ప్రాణత్యాగం చేసిన, గాయపడిన సైనికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సాయుధ దళాల యుద్ధ ప్రమాదాల సంక్షేమ నిధిని కూడా ఏర్పాటు చేసిందని వెల్లడించింది. ఈ నిధి యుద్ధ బాధితులకు, వారి కుటుంబాల సంక్షేమానికి సహకారం అందిస్తుందని, సైనిక దళాల ఆధునీకరణ, ఆయుధాలు కొనుగోలు కోసం కాదని స్పష్టం చేసింది.

==============================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు UK విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీతో మాట్లాడారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిపై రెండు దేశాల నాయకులు చర్చించారు. ఉగ్రవాద చర్యలను ఎంతమాత్రమూ ఉపేక్షించరాదన్నారు.

==============================

ముక్కోణపు సిరీస్ లో భాగంగా శ్రీలంకలోని కొలంబోలో మహిళల తొలి వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 38.1 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బాటింగ్ చేసిన భారత్ జట్టు 29.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

==============================
==============================